**జీవితంలో** అనేకమైన సంఘటనలు జరుగుతూ ఉంటాయి. వాటితోపాటే మరిచి పోలేని అనుభవాలు కలుగుతూ ఉంటాయి. కొన్ని విషయాలు మనం మరిచిపోగలుగుతాం. కాని కొన్ని విషయాలు మరిచిపోదామన్నా మరిచి పోలేము. అవి మన మస్తిష్కంలో స్థిర నివాసం ఏర్పరచుకొని అలాగే ఉండిపోతాయి. అటువంటి మరపురాని అనుభవమే నాకొకసారి కలిగింది.

భయం మానవుని లోపము. కాదన్నా లేదన్నా పోయేది కాదు. ఉన్నదని గుర్తించడానికి మాత్రం మానవుడు భయపడతాడు. భయానికి భయం! తెలియనిది అంటే మరీ భయం. కనుకనే సాహసికులను చూస్తే ముచ్చట కలుగుతుంది. వారి అనుభవం ఎలాంటిదో తెలుసుకోవాలనీ అనిపిస్తుంది.

---

# రాత్రి గడిచిపోయింది

తమ్మా వెంకటేశ్వర ప్రసాద్



ఇది అయిదు సంవత్సరాల క్రిందటి మాట. అప్పుడు నేను బెంగుళూరులో ఒక లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఏజంటుగా పని చేస్తున్నాను. ఒంటరివాడిని, చాలినంత జీతం. , రోజులు హాయిగా గడిచిపోయేవి. కాని ఒక రోజు నన్ను బెంగుళూరునుంచి డేరాడూన్ బదిలీ చేసినట్లు తెలిసింది. నేను కూడా ఉత్సాహంతోనే డేరాడూన్ బయలుదేరి వెళ్ళాను.

డేరాడూన్ చాలా బాగుంది. చక్కని వాతా



NATIONAL-CAL-B-40TG

## రాత్రి గడిచిపోయింది!

వరణం; దగ్గరలోనే హిమాలయ పర్వతశ్రేణి; ఊరినిండా పూల తోటలు—అంతా ఒక భూతల స్వర్గంలాగా ఉంది. కాని ఇక్కడ ఒక్కటే కష్టం. అద్దెకు ఇల్లు దొరకటం మహా కష్టం.

అప్పటికే చాలా చోట్ల తిరిగాను. కొన్ని ఇళ్ళు మరీ రోడ్డుమీదకు ఉన్నాయి. కొన్ని ఇళ్ళకు నీటి సౌకర్యం లేదు. కొన్నిటికి అద్దెలు జాస్తి. కొన్ని నాకే నచ్చలేదు. ఆఖరికి విసుగు పుట్టి ఇళ్ళకోసం తిరగటం మానుకొన్నాను. అలాగే ఆ హోటల్ గదిలోనే కాలం గడుపుతున్నాను.

ఒక రోజు సాయంత్రం అలా గాంధీ పార్కులోకి షికారు వెళ్ళితే అక్కడ ఒక పెద్ద మనిషితో పరిచయమైంది. ఆయనతో ఆ విషయం, ఈ విషయం మాట్లాడుతూ అద్దె ఇళ్ళ సంగతి వచ్చి నా కెక్కడా మంచి ఇల్లు దొరకలేదని ఆయనతో చెప్పాను. అందు కాయన తనకు తెలిసిన ఒక ఇల్లు ఖాళీగా ఉన్న దని, అది రాజపూర్ రోడ్డులో ఉన్నదని, కావల్సి వస్తే చూపిస్తానని అన్నాడు. నేను ఆయనతో రాజపూర్ రోడ్డులో ఉన్న ఆ ఇంటిని చూడటానికి వెళ్ళాను.

ఆ పెద్ద మనిషి కొంచెం అతిగా మాట్లాడే రకం. రోడ్డుమీ దంతా ఆ ఇంటిని గూర్చే మాట్లాడాడు. ఆ ఇల్లు ఒక నేపాలీ అతనికి చెందినదని, అతను తన కూతురుతో అక్కడ ఉండేవాడని, కొద్ది రోజుల క్రితమే తండ్రీ, కూతురు ఏవో అనుమానాస్పదమైన పరిస్థితులలో చనిపోయారని, ఇంకా ఏమేమో చాలా విషయాలు ఆయన ఏకరువు పెట్టాడు. కాని అన్ని విషయాలు చెప్పినా ఇల్లుమటుకు చాలా బాగుంటుందని చెప్పాడు.

మే మిద్దరం ఆ ఇంటి దగ్గరకు చేరుకొని ఆ ఇంటి ప్రస్తుత యజమానితో పరిచయం చేసుకొని ఇల్లు చూపమని అడిగాము. అతను ఆ ఇల్లంతా చూపాడు. నిజానికి ఇల్లుమటుకు చాలా బాగుంది. ముందు వరండా; విశాలమైన గదులు; చక్కని గాలి. ఇంటికి వెనకవైపు నుంచి చూస్తే ప్రకృతి సౌందర్యాన్నంతా ఒలకబోసే ముస్సోరి కొండల దృశ్యం కంటికి కనిపిస్తూ ఉంటుంది. ఇంటి చుట్టూ ప్రహరీ గోడ, ముందు ఖాళీ స్థలము, ప్రహరీ గోడదగ్గరగా చుట్టూ పొడుగుపాటి పెద్ద పెద్ద యూకలిప్టస్ చెట్లు. ఖాళీ స్థలంనిండా పూల పొదలు బాగా పెరిగి ఉన్నాయి. ఇల్లంతా పాడుపడినట్లుంది. అయినప్పటికీ ఆ ఇల్లు నాకు నచ్చింది. అద్దె విషయమై ఆ ఇంటి యజమానిని అడిగాను.

అతను నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. కొంత

చేసియున తరువాత నెమ్మదిగా "నెలకు ముప్ఫయి రూపాయలు" అని అన్నాడు.

నేను ఒక్కసారి ఎగిరి గంతువేశాను. అంత పెద్ద ఇల్లు కేవలం ముప్ఫయి రూపాయలు మాత్రమే! నేను వెంటనే ఒప్పేసుకొని ఒక నెల అడ్వాన్సు అతనికి చెల్లించాను. ఆ ఇల్లు నాకు అద్దెకు దొరికిందనుకోగానే నాకు దేవుడు వరమిచ్చినంతగా సంతోషించాను. డబ్బు తీసుకొనేటప్పుడు అతను కొంచెం సందేహిస్తున్నట్లు కనిపించాడు. ఏదో చెప్పాలనుకుంటున్నట్లున్నాడు.

అది కనిపెట్టి నేను "ఏమండీ, మీరేమైనా చెప్ప దల్చుకొన్నారా?" అని అడిగాను.


అతను నావైపు ఒక మోస్తరుగా చూచి చెబుదామా, వద్దా అని కొంచెంసేపు తటపటాయించి, చివరికి "చూడండి. నేను ముక్కుకు మాటిగా నడిచేమనిషిని. ఏ సంగతీ నాకు దాచటం ఇష్టం లేదు. ఈ ఇంటి విషయమై ఇక్కడి ప్రజలు తలోక విధంగా అనుకుంటారు. చాలా రోజులనుంచి పాడుపడి ఉంది. ఈ ఇల్లు తీసుకోవటం అంత శుభదాయకం కాదంటారు. మీకు చెప్పవల్సినదంతా చెప్పాను. తరువాత మీ ఇష్టం" అన్నాడు.

నాకు ఈ మూఢ నమ్మకాలమీద అసలు నమ్మకం లేదు. అయినప్పటికీ ఉత్సాహం చంపుకోలేక "అయితే ఇదివర కెవరికైనా ఈ ఇంట్లో ఉన్నవారికి అశుభమేదైనా జరిగిందా?" అని అడిగాను.

"లేదు." అతను నిశ్చలంగా చెప్పుకునిపోతున్నాడు—"కాని, కొద్ది రోజుల క్రిందట ఒక పంజాబీ అతను ఈ ఇంటిని అద్దెకు తీసుకొన్నాడు. కాని, పాపం అతను తీసుకొన్న రెండవ రోజుకల్లా స్పృహ లేకుండా తన మంచం మీద పడిఉన్నాడు. తరువాత అతని విషయం ఏమీ తెలియదు. అతను ఎవ్వరితోనూ చెప్పకుండా ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడు. దాని తరువాత ఇంతవరకు ఈ ఇంటిని అద్దెకిమ్మని ఎవరూ రాలేదు."

ఆ మాటలు విన్నతరువాత గట్టిగా నవ్వుదామనిపించింది నాకు. కాని పెద్ద మనుష్యులు వాళ్ళేమైనా అనుకుంటారేమోనని ఊరుకున్నాను. తరువాత ఇంటి యజమానికి ధైర్యం చెపుతూ "మీ రేమీ గాబరా పడకండి. నాకిటువంటి వాటిలో నమ్మకం లేదు. అదీకాక నామీద నాకు పూర్తిగా విశ్వాసముంది" అన్నాను.

నేను కనిపెడుతూనే ఉన్నాను. అతనికి నా మాటలమీద విశ్వాసం కుదిరినట్లు లేదు. అతని ముఖం పరీక్షిస్తే ఈ విధంగా అనుకుంటూ ఉన్నట్లు కనిపెట్టాను—"నాయనా, మొదట్లో అందరూ నీలాగే డప్పాలు కొడతారు. కాని ఇంట్లో చేరిన మరునాడే తూర్పెటో, పడమరెటో తెలియకుండా పారిపోతారు!"




రేవు ముఖద్వారం

# విశాఖపట్టణం రేవు దృశ్యాలు

ఫోటోలు — బి. ఎస్. ప్రకాష్ (సుందర్ ఘర్)

రేవులో లంగరు వేసిన నౌకలు



# రాత్రి గడిచిపోయింది!

ఆ మరునాడు మా ఆఫీసులో నాకు ఇల్లు దొరికిందని, చాలా బాగుందని నా స్నేహితులకు చెప్తే వాళ్ళు అంతా విని ఆ ఇంటికి వెళ్ళవద్దని, అది పాడుపడినదని, ఇంట్లో ప్రవేశించగానే ఏదో ఒక అశుభం జరుగుతుందని చాలా హెచ్చరించారు. వాళ్ళ మాటలు విని నేను నవ్వేసి ఊరుకున్నాను.

అనుకున్న ప్రకారం నేను సామానంతా తీసుకొని ఆ ఇంట్లో ప్రవేశించాను. ఆ ఇల్లు చూసినకొద్దీ నాకు మహా ఆనందంగా ఉంది. ఆ రోజంతా నా సామాన్లు సర్దుకుంటూనే గడిపివేశాను. సాయంత్రం "హారర్ ఆఫ్ డ్రాకులా" అనే ఇంగ్లీషు సినిమా చాలా బాగుంటుందని విని చూడటానికి వెళ్ళాను.

వెన్నెలలు
కురిసే
ఆరోగ్యమైన
చిరునవ్వులు




నిజమే. ఎందుకంటే, కుటుంబమంతా రెమీ టూత్ పేస్టు వాడుతుంది. పుష్కలమైన దాని నురుగు పండ్లను బాగా శుభ్రపరచును. దానినున్నితమైన సువాసన చాలాసేపటివరకు నోటిలో గుబాళించుచుండును.

రెమీ
టూత్ పేస్టు
(అజులేన్‌తో)

పౌడరు టిన్నులలో కూడా అమ్మబడును.
రెమీ ప్రాడక్ట్సు, ఇండియాలో తయారుచేయబడినవి.

మలయాలో దొరికే చోటు
మీనా ట్రేడింగ్ కంపెనీ, 50 ఏ. మార్కెట్ రోడ్డు, సింగపూర్—1.

సింహళంలో దొరికేచోటు
ఏవిఆర్‌పి లిమిటెడ్, కొలంబో

రెమీ నాటిక వినోదం-ప్రతి శుక్రవారం రేడియో సిలోన్-
41.72 మీటర్లమీద సా. 6-30 గం. నుంచి 6-45 గం. వరకు వినండి.

ఆ సినిమాలో క్షణ క్షణాన భీతిగొల్పే దృశ్యాలు చాలా ఉన్నాయి. నాకు బాగా నచ్చింది. సినిమా అయ్యేటప్పటికి 9—30 గంటలు అయింది. అక్కడే హోటల్లో భోజనంచేసి ఇల్లు చేరుకున్నాను. ఇంటి చుట్టూ చీకటి గాఢాంధకారం. చుట్టూ ఉన్న పొదలో నుంచి కీచురాళ్ళు ధ్వనిచేస్తున్నాయి. ఆ ఇల్లు నా కేదో భయాన్ని కలుగచేస్తున్నట్లుగా అనిపించింది. మళ్ళా నా భ్రమకు నేనే నవ్వుకుని నా పడక గది చేరుకుని బట్టలు మార్చుకొని మెల్లిగా మంచంమీదకు చేరాను. కాస్సేపట్లోనే నాకు బాగా నిద్ర పట్టింది.

అలాగ ఎంతసేపు నిద్రపోయానో నాకే తెలియదు. కాని ఒక చిన్న కుదుపుతో నాకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూచాను. ఆ చీకట్లో నా దగ్గరగా ఒక నేపాలీ అతను నిలబడి నన్ను కళ్ళార్పకుండా చూస్తున్నాడు. అతని మొహంమీద నేను నా "బ్యాటరీ లైటు"ను వేసి చూశాను. అతని జుత్తు నెరిసిపోయి గిరజాలు కట్టుకొని ఉంది; ముడుతలు పడ్డ ముఖం; బుగ్గలు లోపలికి పీక్కుపోయాయి; ఊతగింజల్లాంటి చిన్న కళ్ళు—చూడటానికి చాలా భయంకరంగా ఉన్నాడు.

అతను నన్ను అలాగ చూస్తూనే ఏదో గట్టిగా నోటితో ఉచ్చరిస్తున్నాడు. ఆ చూపులోనూ, అతను ఉచ్చరించే మాటల్లోనూ ఏమి శక్తి ఉందో గాని నన్ను చాలా బలహీనుడుగా చేసివేసింది. నా బుర్ర పని చేయటం మానివేసింది. శరీరమంతా గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంది. అతను నా చెయ్యి గట్టిగా పట్టుకొన్నాడు. అతని చెయ్యి మంచుగడ్డ కంటే చల్లగా ఉంది. నన్ను పట్టుకోగానే ఆ చల్లదనానికి నా రక్తమంతా గడ్డ కట్టినట్లయింది. నన్ను అతను తేలికగా ఎక్కడికో లాక్కునిపోతున్నాడు. తల నొప్పితో పగిలిపోతున్నది. ఇంతలోనే నా తలకు ఏదో భారంగా తగిలింది. అంతే. తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. నాకు స్పృహ తప్పిపోయింది.

మళ్ళీ నాకు స్పృహ వచ్చేటప్పటికి, నేనొక చక్కని, మెత్తని, అందమైన పాన్పుమీద పడుకుని ఉన్నాను. కళ్ళు తెరిచి చూచాను. గది అంతా రక్త వర్ణపు కాంతితో నిండిఉంది. నా కళ్ళు తిరుగుతున్నాయి. చాలా నీరసంగా ఉంది. నా శక్తి అంతా కూడగట్టుకొని ఒక్కసారి గదంతా పరికించి చూశాను. గది మాత్రం నా పడకగది మాదిరిగానే ఉన్నది. కాని దాని రూపురేఖలు మాత్రం పూర్తిగా మారిఉన్నాయి. గుమ్మాలకు, కిటికీలకు ఎర్రటి తెరలు వ్రేలాడకట్టి ఉన్నాయి. గదిలో రెండు సోఫాలు ఉన్నాయి. గోడలకు నాలుగు వైపులా మంచి ఫోటోలు ఉన్నాయి.

నా కేమీ అర్థంకాక నేను అలాగే చూస్తూ ఉన్నాను. ఇంతలోకే నాకు ఒక మధురమైన

కంఠం వినిపించింది. ఆ కంఠం నన్నే పలక రిస్తున్నదా అన్నట్లున్నది. వెనుకకు తిరిగి ఆ శబ్దం వచ్చేవైపుకు చూచాను.

"అయితే మీకు స్పృహ వచ్చిన దన్న మాట—బాగుంది" అంది ఆ కంఠం.

ఆ వైపుకు చూచాను. ఒక చక్కని నేపాలీ యువతి నావైపు చాలా దయతో, కరుణతో చూస్తూ ఉంది. ఓ క్షణంపాటు ఆమెను ఆపాద మస్తకం పరీక్షగా చూశాను. చెప్పలేనంత అందంగా ఉంది. మోహం కళకళ్ళాడుతూంది. ఆమెను చూచిన క్షణం నుంచి నాలో ఉత్సాహం ఎక్కువైంది. ఎవరై ఉంటుందీమె? నేను దీర్ఘంగా ఆలోచిస్తున్నాను. కాని ఏమీ అర్థం కావటంలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? దయచేసి ఆ సోఫామీద కూర్చోండి" ఆమె చిరునవ్వుతో మెల్లిగా అన్నది.

"నే నెక్కడున్నాను? మీ రెవరు?" నేను గట్టిగా అరిచాను.

ఆమె చాలా ఆశ్చర్యంతో నన్ను చూసింది. మెల్లిగా నవ్వుతూ "మీరు ఒక్కసారే రెండు ప్రశ్నలు వేస్తే ఎలా సమాధానం చెప్పగలను? మీకు తెలుసుకోవాలని ఉంటే ఒక్కొక్క ప్రశ్న అడగండి. ముందు మీలో ఉన్న ఆవేశాన్ని తగ్గించుకోండి. నాకు తెలిసినంతవరకు చెప్తాను. అంతే కాని కోపం తెచ్చుకొని ఏమి ప్రయోజనం?" అని అన్నది.

నేను ఇంకేమీ మాట్లాడకుండా అక్కడున్న సోఫాలో కూర్చున్నాను. అప్పుడు నా బుర్ర విపరీతమైన ఆలోచనలతో నిండి ఉంది.


"ఇప్పుడు చెప్పండి. నే నెక్కడ ఉన్నాను?" నా స్వరాన్ని, మాటల్ని కూడగట్టుకుని అడిగాను.

"మీరు ప్రస్తుతం మా ఇంట్లో ఒక గదిలో ఉన్నారు. నేను వీణ వాయించుకొంటూ ఉన్నాను. బయట ఏదో శబ్దమైతే తలుపు తీసిచూశాను. మీరు తెలివితప్పి అక్కడ పడిఉన్నారు. మిమ్మల్ని నేను మెల్లిగా లేవతీసి ఈ మంచం పైకి చేర్చాను....అంతే." ఆమె తన కమ్మని స్వరంతో పలికింది.

"అయితే మీ రెవరు?" నేను ఉద్వేగాన్ని అపుకోలేక అడిగాను.

"నేనా? నా పేరు సోను. నేను ఈ ఇంటి యజమాని కుమార్తెను."

నేను ఆమె ముఖాన్ని పరీక్షచేస్తూ అలాగే కన్నార్పకుండా చూశాను. ఆమె సౌందర్యము, తియ్యని మాటలు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. ఆమెను దగ్గరకు తీసుకోవాలని మనస్సులో కోర్కె కల్గింది. కాని నన్ను నేను సంభాళించుకొని "ఇక్కడినుండి బయటకు వెళ్ళేందుకు మీరు నాకు సహాయం చేస్తారా?" అని చాలా దీనంగా అడిగాను.



పైపైకి ఫోటో—ఎస్. జి. శేషగిరి (కోయంబత్తూరు-9)

"కాని మీరు ఇక్కడినుండి ఎలా బయట పడగలరు?"

"ఏం, ఆ గుమ్మంలోంచి బయటకు వెళ్ళ వచ్చు కదా!"

"వెళ్ళవచ్చును. కాని ఇక్కడనుండి బయట పడటం చాలా కష్టమైన విషయం."

"కేవలం కష్టమైన విషయమే కాని అసంభవం మటుకు కాదు గదా?" అంటూ నేను లేచి నిలబడ్డాను.

"చూడండి. గాబరా పడవలసిన పనేమీ లేదు. మీరు చాలా నీరసంగా ఉన్నారు. విశ్రాంతి అవసరం. వెళ్ళి కాసేపు నిద్రపోండి. ఈ విషయాన్ని గూర్చి తర్వాత మాట్లాడుదాం" అని ఆమె వెళ్ళిపోయింది.

నేను ఆలోచించాను. ఎవరై ఉంటుం దీ సుందరి? ఇంతలోకే మళ్ళా ఆ నేపాలీ ఆతను, అతని తీక్ష్ణమైన చూపులు జ్ఞాపకం వచ్చాయి. ఆ చూపుల్లో ఏమి శక్తి ఉన్నదో గాని అది తలుచుకోగానే నా శరీరం పులకరించింది. భయం వేసింది. కళ్ళు మూసుకొన్నాను. నిద్ర ఎప్పుడు పట్టిందో నాకు తెలియదు.

కొంతసేపు నిద్రపోవటంవల్లనేమో నాకు మెలకువ రాగానే ఒళ్ళు కొంచెం తేలికగా ఉంది. బుర్ర సరిగా పని చేస్తున్నది. కొంచెం ఆకలి కూడా వేసింది. చుట్టూ చూశాను. దగ్గరలోనే ఒక మేజాపైన గాజు గ్లాసొకటి కన్పించింది. ఆ గ్లాసులో ఏదో పాలవంటి ద్రవం ఉంది. వెంటనే గ్లాసు తీసుకొని దాన్నంతా ఒక్క క్షణంలో ఖాళీ చేసివేశాను. దాంట్లో ఉన్నది పాలు మాత్రం కాదు; కాని పాలకంటే చాలా రుచిగా ఉంది.

అది త్రాగిన తరువాత నాకు ఎక్కడలేని శక్తి వచ్చింది. మంచంమీదనుంచి లేచి పచార్లు చేయటం మొదలుపెట్టాను. నా బలమంతా ఉపయోగించి తలుపులు తెరిచి బయటికి పారిపోదా మనుకొన్నాను. కాని తలుపులకు బయటవైపు తాళం వేసిఉంది. అవి తీయటం నాకు సాధ్యమవలేదు. ఆఖరికి విసుగుపుట్టి ఆ ప్రయత్నం విరమించి మళ్ళా మంచంమీద కూలబడ్డాను.

ఇంతలో తలుపుదగ్గర చప్పుడైతే అటు చూచాను. ఎదురుగా ఆ నేపాలీ సుందరి కనిపించింది. ఈ సారి ఆమె కళ్ళల్లో ఆవేదన, బాధ కన్పిస్తున్నాయి. వాటిని కనపడనీయకుండా ఉంచటానికి లేని చిరునవ్వు తెచ్చిపెట్టుకొని ఆమె నవ్వుతూంది. నేను ఆమెను అంతకంటే ఎక్కువ పరీక్షచేయలేదు. ఎందుకంటే నాకు అక్కడినుంచి ఎలాగైనా పారిపోవాలనే ఆలోచన బాగా పట్టుకుంది.

"చూడండి." నేను చాలా వినయంగా పలికాను—"నన్ను ఇక్కడినుండి వెళ్ళి పోనివ్వండి. మీకు నేను జీవితాంతం కృతజ్ఞుడుగా ఉంటాను."

"కాని ఎలా వెళ్ళగలరు? ఇక్కడినుంచి బయటపడటం సులభమైన విషయంకాదు. ఇంతకంటే ఈ విషయమై మీకు చెప్పటం గాని, నేను వినటంగాని వ్యర్థమే అవుతుంది" అని చెప్పి ఆమె మాటాడక ఊరుకుంది.

నేను ఆలోచిస్తూ సోఫాలో కూర్చుండి

(తరువాయి 49 వ పేజీలో)

# రాత్రి గడిచిపోయింది!

(17వ పేజీ తరువాయి)

పోయాను. సోమకూడా కళ్లార్పకుండా నా వైపు చూస్తూ కూర్చుంది. ఈ విధంగా చాలాసేపు గడిచింది. మా ఇద్దరిమధ్య చాలా సేపటివరకు మౌనం తాండవించింది. తరువాత నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఆమెతో "మీ నాన్నగారెక్కడ? ఇంతవరకు మీ ముఖం తప్పించి ఇంకెవ్వరి ముఖం నాకు కనపడలేదు" అన్నాను.

"నాన్నగారు ప్రయోగశాలలో ఏదో పరీక్ష చేస్తున్నారు. ఇప్పుడే ఆయన్ను మీకు పరిచయం చేస్తాను."

ఆమె తండ్రిసంగతి ఎప్పుడైతే నేను అడిగానో వెంటనే ఆమె ముఖం వెలవెలాపోయింది. ఎందుకో పాలిపోయినట్లయింది. కళ్లల్లో ఒక విధమైన భీతి కనిపించింది. బహుశః ఆమెకు వాళ్ల నాన్నంటే ఎందుకో భయమని ఆమె ప్రవర్తనను బట్టి నేను గ్రహించాను.

తరువాత ఆమె ప్రక్కనున్న గదికి వెళ్లిపోయి మళ్లీ కాస్సేపట్లో నాదగ్గరకు వచ్చింది. ఈసారి ఆమె చేతుల్లో ఒక తెల్లని 'సూట్' ఉంది. ఆ 'సూట్' వేసుకొమ్మని నాకు సంజ్ఞ చేసింది. నేను మాట్లాడకుండా అది తొడుక్కున్నాను. ఆ సూటులో నేను చాలా అందంగా కూడా ఉన్నాను. సోమకూడా నన్ను ప్రశంసాపూరిత నేత్రాలతో అభినందించింది. తరువాత ఒక దువ్వెన తీసుకొనివచ్చి నాజుత్తు సరిగా తనే దువ్వింది. తరువాత నా నడుం దగ్గర చెయ్యిపెట్టి తన తియ్యని చూపులతో నన్ను పులకితుణ్ణి చేస్తూ "పదండి" అని మాత్రం అన్నది.

ఆమె చనువుచూసి ఆమెను ఒక్కసారి దగ్గరగా తీసుకొని ముద్దుపెట్టుకుందామని మనస్సు తహతహలాడింది. కాని కోర్కెను వాలోనే అణచుకొని "పదండి" అని అన్నాను.

ఆమె వెనకాలే నడిచి వెళ్లుతున్నాను. మేము గది బయటకు రాగానే ఒక గ్యాలరీహాలు కన్పించింది. ఆగ్యాలరీహాలుదాటి మేమిద్దరం ముందుకు నడిచాం. ఆహాలు ప్రక్కనే మరో గది ఉంది. ఆ గదిదగ్గర సోమ ఆగి అక్కడే ఉన్న 'కాలింగ్ బెల్' మ్రోగించింది. తరువాత తను నాదగ్గరకువచ్చి "ఆయన చేస్తున్న పనులంటే నాకు అసహ్యం. నాకిష్టంలేక పోయినా ఆయన చెప్పినట్లు నడుచుకోక తప్పటంలేదు. నన్ను మీరు తప్పుగా అర్థం చేసుకోవద్దు. నేను మిమ్మల్ని... మిమ్మల్ని ప్రే..... మీ మీద నాకు చాలా గౌరవభావం ఉంది" అని సిగ్గుతో తలవంచుకుంది.

ఆమె పలికిన మాటల్లోని అర్థాన్ని నేను గ్రహించాను. ఇంతలోనే గదిలోపలినుంచి "రావమ్మా" అనే గంభీరమైన మాటలు వినవచ్చాయి.

సోమ తలుపునెట్టి నన్ను రమ్మని సంజ్ఞ చేసింది. ఆమె వెనకాలే నేనూ వెళ్లాను. మే మిద్దరం ఒక పెద్దగదిలో ప్రవేశించాం. గది మధ్యన పెద్ద టేబుల్ ఉన్నది. నాలుగు వైపులా ఎన్నో అలమార్లు ఉన్నాయి. ఆ అలమార్లనిండా ఏవేవో రసాయనాలతో నింపిన సీసాలు ఉన్నాయి. చూడటానికి ఆగది ఒక చిన్న ప్రయోగశాలలాగ ఉంది. అక్కడే సోమ తండ్రి కూర్చుని ఉన్నాడు. అతను ఏదో ప్రయోగం చేస్తున్నట్లున్నాడు. చేతిలో ఒక 'టెస్ట్ ట్యూబ్' ఉన్నది. దాని నిండా తెల్లనిద్రవం ఉంది. ఆతెల్లనిద్రవంలో ఏదో పీలపురంగుపొడి వేస్తున్నాడు. ఆపొడి ఆ తెల్లని ద్రవంలో పడగానే ఆద్రవమంతా ఆకుపచ్చగా తయారైంది. మేము ఆయన వెనకాలే నిలబడి ఉన్నాము. నాకు ఆయన వీపుభాగం తప్ప ముఖం కనపడటంలేదు. అంతలోనే ఆయన చాలా మర్యాదగా "దయచేసి ఆకుర్చీలో కూర్చోండి, మిస్టర్ ఆనంద్!" అన్నాడు.

నాకు చాలా ఆశ్చర్యమేసింది. అతనికి నాపేరెట్లా తెలిసింది? అదికాకుండా అతని గొంతుకూడా ఎక్కడో విన్నట్లుగా అని పిస్తున్నది. నేను జ్ఞాపకం తెచ్చుకుందామని ప్రయత్నిస్తున్నాను. ఇంతలోనే అతను మళ్లీ మాట్లాడటం మొదలుపెట్టాడు.

"ఏవిషయాన్నీ మళ్లీమళ్లీ చెప్పటంగాని చేయటంగాని నాకు అలవాటులేదు, మిస్టర్ ఆనంద్!" అంటూనే అతను నావైపు తిరిగాడు. అతన్ని చూసి నేను ఉలిక్కిపడ్డాను. నాకు మనస్సులో ఒకవిధమైన వికారం కలిగింది. అతను, ఎవ్వరోకాదు, అతనే. నన్నిక్కడకు ఈడ్చుకొనివచ్చిన ఆ నేపాలీయే. ఇంక అతడెవరా అని ఆలోచించాల్సిన పని లేకపోయింది. నారక్తమంతా అతన్ని చూచిన తరువాత వేడెక్కిపోతూంది. కాని నన్ను నేను సంభాళించుకొని అడిగాను:

"అయితే, మీరు నన్నెందుకు ఇక్కడికి తీసుకొనివచ్చారు? మిస్టర్.. మిస్టర్...?"

"నన్ను ప్రొఫెసర్ థాపా అంటారు. నాపేరు వీరేంద్ర థాపా" అతను నవ్వుతూ అన్నాడు. అతనిలోని కాఠిన్యమంతాపోయి మెల్లిగా చాలా మర్యాదగా మాట్లాడుతున్నాడు. "ఆనంద్! మిమ్మల్ని ఎందుకు తీసుకొని వచ్చానో ఇప్పుడే చెప్తాను. మీరు ఆకుర్చీలో కూర్చోండి."

అతను ప్రక్కకుతిరిగి తను తయారుచేసిన ఆపచ్చని ద్రవాన్ని నాకు చూపుతూ— "చూడండి, ఈ ద్రవంలో ఏముందో తెలుసా? శుద్ధమైన యురేనియం. దానిని ద్రవరూపంలోకి తీసుకొనివచ్చాను" అన్నాడు. ఆ ద్రవానికి ఇంకేదో రసాయనం కలిపినని


## డాక్టరుకండి!

పోస్టుద్వారా ఇంటివద్దనే హోమియోపతి నేర్చుకొని ఎం. డి. హెచ్. డిప్లమో పొందండి. ఫ్రీ ప్రాస్పెక్టసుకు వ్రాయండి.

TAGORE HOMOEOPATHIC COLLEGE & HOSPITAL, (A.P.W.V.) Bahadurgarh, Near Delhi.

## తాంబూలములకు

యాలక్కాయ, లవంగము యిప్పుడు అక్కరలేదు

**రుచి**

సుగంధ ద్రవ్య సముదాయము.
పచ్చకర్పూరం, కుంకుమ పువ్వు చేర్చబడినది.
అన్ని కిరాణా కొట్లలో దొరుకును.
కిళ్లీకొట్లలో వాడబడుచున్నది.
¼ పౌ. రు. 3—25, పోస్టేజి అదనం.
నానాకాన్ఫెక్షనరీ, విజయవాడ—2.

## శ్రీ బాలాంజనేయ ప్రశ్న

సంతానం, రోగములు, గ్రహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలించినసొమ్ము, విడిపోయిన భార్యా, మీరు కోరిన 5 ప్రశ్నలకు వెంటనే వ్రాసి పంపగలము. 2 రూ. ఎం. ఓ. చేయండి. నెలలు వారీగా 12 నెలలకు 1 సంవత్సరం జాతకము 2 రూ. పూర్తి పేరు, జాబువ్రాసిన టైము తెలిసిన చాలును. హనుమాన్ జ్యోతిషాలయము. 10వ లైను, అరండల్ పేట, గుంటూరు—2.




బ్రాంచీలు: వాల్తేరు ఆర్. ఎస్.
సికింద్రాబాద్ — 3560 కింగ్సువే

చెప్పాడు. ఆ రసాయనం పేరేమిటో నాకు సరిగా జ్ఞాపకంలేదు. అది కలిపిన తరువాత అతెల్లని ద్రవం ఆకుపచ్చగా మారింది.

"నేను తయారుచేసిన ఈద్రవం ఒక అమోఘమైన ఔషధం. దీనిని నేనే కని పెట్టాను. ఇదినాకు గర్వకారణం. ఎన్నో సంవత్సరాల శ్రమకు ఫలితం. ఈరోజు నాకు మహానందంగా ఉంది" అని చెప్పి ఇంకేమీ మాట్లాడక నోరుతెరచుకొని ఆద్రవం వైపు చూస్తూ కూర్చున్నాడు.

నేను ఒకసారి అతనిముఖంలోకి తేరిపార చూచాను. చాలా ఉత్సాహంగా ఉన్నాడు. మొహంలో ఆనందం తాండవమాడుతూంది. బహుశః అతని వయస్సు అరవై దాటి ఉంటుంది. కాని ఆ వయస్సులో కూడా మంచి పుష్టిగా ఉన్నాడు. నీలపురంగు సూటు వేసుకున్నాడు. చూడటానికి పెద్దమనిషిలా నే అవుపిస్తున్నాడు.

"కాని ఈ విషయాలు నాతో చెప్పటం వల్ల మీ కేమి ప్రయోజనం? నేను కేవలం ఒక జీవిత భీమా ఏజంటును మాత్రమే. మీరు మీ జీవితాన్ని భీమాచేసుకోవాలని ఉంటే చెప్పండి. మా కంపెనీ పాలిసీ అంతా చెప్తాను. అదీకాకుండా మా ఇన్స్యూరెన్స్ కంపెనీ మంచి పేరు ప్రఖ్యాతులు గలది కూడాను. అంతేకాని నాకీ మందులతో ఏం పని? అందుకని తమరు నన్నిక్కడకు ఎందుకు తీసుకొని వచ్చారో దయచేసి త్వరగా చెప్పండి"

## రాత్రి గడిచిపోయింది!

నేను అతను చెప్పిన మాటలు విని చాలా మర్యాదగా అన్నాను.

సోమ మాట్లాడకుండా నిలబడి మా ఇద్దర్నీ అదేపనిగా చూస్తూ ఉంది. ఆమె అందమైన మొహం కాంతివిహీనమై భయాన్ని వ్యక్తపరుస్తున్నది.

"ఏమీ లేదు..." చెపుతూ, చెపుతూ అతను ఆపివేసి ఒకసారి భావశూన్యమైన దృష్టితో సోమవైపు చూచాడు. సోమ అతని ఉద్దేశ్యం అర్థంచేసుకొని గది బయటికి వెళ్ళిపోయింది.

థాపా మళ్ళీ చెప్పటం మొదలు పెట్టాడు: "నేను తయారు చేసిన ఈ ఔషధం సరియైన ఫలితం తెలుసుకొని నేను నాప్రయత్నంలో సఫలం అయ్యానో లేదో తెలుసుకోటానికి నాకు ఒక వ్యక్తితో అవసరం ఎంతైనా ఉంది. ఈ ఔషధాన్ని మనుష్యుని శరీరంలోకి ఎక్కిస్తే ఆమనిషి సుమారు వెయ్యి సంవత్సరాలు బ్రతికి ఉండేటట్లుగా చేస్తుంది. లేకపోతే ఆమనిషి ఈమందు ఎక్కించిన క్షణంలోనే చనిపోనూవచ్చు. అందుకని" అని మటుకు చెప్పినావైపు తాను చెప్పినదాంట్లో అర్థం స్ఫురించిందా అన్నట్లు చూచి— "ఈ ఔషధాన్ని మొట్టమొదటిసారి నీ శరీరంలోకే ఎక్కిస్తాను. నాశ్రమ ఎంతవరకు ఫలించిందో చూస్తాను. అందుకనే నిన్నిక్కడకు తీసుకొని వచ్చాను" అన్నాడు.

అతను చెప్పినదంతా వినేటప్పటికి నా కళ్ళు వచ్చబడిపోయాయి. కుర్చీకి ఒక్క క్షణం అతుక్కుపోయాను. త్రుళ్ళిపడి "వీల్లేదు, అలాజరగటానికి వీల్లేదు!" అని నేను భయంతో గట్టిగా అరిచాను. "మీరు అలా చెయ్యటానికి వీల్లేదు. అలాచేస్తే మీరు కోర్టులో చిక్కుకుంటారు. ఈనేరానికి మిమ్మల్ని కోర్టువారు శిక్షించకమానరు."

"న్యాయస్థానాలు, పోలీసులు అంటే నా కేమీ భయంలేదు. వారు నన్నేమీ చేయ లేరు. కాని నిన్ను అన్యాయం చెయ్యటం నాకిష్టంలేదు. అందుకని ఈ విషయంలో నీకొక చిన్నసహాయం చేస్తాను. అదేమిటంటే నువ్వు భీమా ఏజంటువికదా! అందుకని నీ జీవితాన్ని నువ్వే ఎన్నివేలకైనాసరే భీమా చేసుకో. ఈ నా ప్రయోగం సరియైన ఫలితాన్నిచ్చిందా భీమా కంపెనీకి కట్టవలసిన 'ప్రీమియమ్స్' అన్నీ నేను కట్టుతాను. లేక నీవు చనిపోవటం జరిగితే ప్రమాదవశాత్తూ చనిపోయావని తలంచి మీ ఇన్స్యూరెన్స్ కంపెనీవారే మీ వాళ్ళకు డబ్బు చెల్లిస్తారు. అదీకాకుండా నీ జీవితం విలువెంతో చెప్పు. ఆడబ్బు ఇప్పుడే ఇస్తాను. ఆసంగతేదో నిర్ణయించుకుని నాతోచెప్పు."

అతని మాటలు వింటూంటే ఒళ్ళంతా భయంతో కంపించిపోతున్నది. నాకు మతిభ్రమ కలుగుతున్నది. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. కాళ్ళూ, చేతులూ వణికిపోతున్నాయి. నాకేమీ అర్థంకావటంలేదు. ఈపీడ నాకెక్కడ పట్టుకుంది? నిన్ను చంపేస్తాను, నీ జీవితాన్ని భీమా చేసుకో అంటాడేమిటి! నేను జీవిత భీమా ఏజంటునవటం కూడా నాకర్మమేమో! మనస్సులో ఇలాంటి ఆలోచనలు పరిపరి విధాల ఒకదాని వెనుకొకటి దొర్లుకొస్తున్నాయి. ఆరాక్షసుడు ప్రొఫెసర్ థాపా మట్టుకు నన్ను గుడ్లగూబలాగా చూస్తూనే ఉన్నాడు.

అతనికి ఒక మనుష్యుడి జీవితంకంటే తన ప్రయోగం ముఖ్యమైంది. ఎలాగైనా కొంత వ్యవధి తీసుకొని అతన్ని మోసంచేసి అక్కడినుండి పారిపోవాలనే నిశ్చయానికి వచ్చి "మిస్టర్ థాపా, మీరు చెప్పినదానికి నాకు అంగీకారమే. కాని మీరు జీవితాన్ని భీమా చేసుకోమన్నారు కదా! నా జీవితాన్ని ముప్పయి వేలకు భీమా చేస్తాను. రేపే కాగితాలు అన్నీ రాసి మాకంపెనీలో ఇస్తాను. దానితోపాటు మీరు ఇప్పుడు పదివేల రూపాయలు కూడా ఇవ్వాలి" అన్నాను.


"బాగుంది. నాకూ సమ్మతమే" అంటూ అతను ప్రక్కనున్న బల్లసొరుగు తీసి పదివేలకు చెక్కురాసి ఇచ్చాడు.

ఆచెక్కు జాగ్రత్తగా జేబులో పెట్టుకుని నేను—"మిస్టర్ థాపా, నన్నిప్పుడు వెళ్ళ





నన్‌జన్‌గూడు ఔషధములకు ఒక టవునుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము



స్వేచ్ఛా విహారము ఫోటో—పి. కృష్ణకుమార్ (తాడేపల్లిగూడెం)

నివ్వండి. నాగదికిపోయి కాసేపు విశ్రాంతి తీసుకొని రేపు నాపనంతా పూర్తిచేసుకొని మీ దగ్గరకు వస్తాను'' అంటూ లేచి నిలబడ్డాను.

''మిస్టర్ ఆనంద్, నీ వడిగినట్లు పదివేలకు చెక్కు ఇచ్చాను. రేపు తప్పక రావాలి. మోసం చేసినా లేక ఈసంగతి ఇంకెవరికైనా చెప్పినా సరే, నిశ్చయం. నిన్ను, నీవంశాన్ని నాశనం చేస్తాను. జాగ్రత్త. ఇంక నువ్వు వెళ్ల వచ్చును'' అని గట్టిగా అతను చెప్పాల్సింది చెప్పాడు.

తరువాత సోమను గదిలోకి పిలిచి ''ఇతన్ని అతని గదిలోకి తీసుకొని వెళ్లు'' అని చెప్పాడు.

నా పరిస్థితి చూచి నామీదనాకే జాలి వేస్తూంది. నేను సోమ వెంబడే పిచ్చివాడిలా నడుస్తున్నాను. నన్ను గదిలో వదిలి సోమ తిరిగి వెళ్లిపోయింది. వెళ్లిపోతూ వెనక్కుతిరిగి నాముఖంలోకి ఒకసారి చూసి వేడి నిట్టూర్పు వదిలింది. ఆమె మొహంలో అమాయకత్వం, కరుణ చెట్టపట్టాలేసుకున్నట్లు మెరుస్తున్నాయి. ఆమె ఒక చక్కని పాలరాతి విగ్రహంలాగా ఉంది. నేను ఆమె వెళ్లిపోతూంటే చూస్తూ కూర్చున్నాను. అలా ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలియదు. హృదయంలో చాలా భారంగా ఉంది. తల తిరుగుతూ ఉంది. నేను వేసుకున్న ఆతెల్లసూటు తీసివేశాను. ఆ పదివేల రూపాయల చెక్కుని మాత్రం జాగ్రత్తగా నాచొక్కా జేబులో పెట్టుకున్నాను. ఇంతలోనే సోమ నాకేదో త్రాగటానికి తీసుకుని వచ్చింది. ఆమె మొహంలో చింత, ఆవేదన స్పష్టంగా కనిపిస్తున్నాయి. బహుశా ఆమె నాకు, ప్రొఫెసర్‌కు మధ్య జరిగిన సంభాషణంతా విని ఉండవచ్చును.

ఆమె తీసుకొని వచ్చిన పానీయమంతా త్రాగివేసి నేను లేచినిలబడి ''సోమా! నిజంగా నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?'' అని ఆమె రెండు చేతులూ పట్టుకొని చెప్పలేని బాధతో అడిగాను.

'ప్రేమ' అనే పదంతో ఏమి మాయ ఉందోకాని నేనడగ్గానే ఆమె తలవంచుకుని కన్నీరు కార్చటం మొదలుపెట్టింది. దానితో నాకు గట్టి నమ్మకమేర్పడింది—ఆమె నన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నదని. ఆమెను చూస్తే నాహృదయం ద్రవించుకొని పోతున్నది.

''సోమా, నీవు నాకొక సహాయం చెయ్యగలవా?'' నేను ప్రేమతో పలికాను—''నన్ను ఇక్కడినుండి ఎలాగైనా బయటకు చేర్చు.''

ఆమె కాస్సేపు ఆలోచించి ''అవును. ఈనరకం నుంచి మీరు బయటపడి తీరాలి. మిమ్మల్ని మా నాన్న.....!అబ్బ! నేను చూడ లేను. కాని మిమ్మల్ని బయటకు పంపే టప్పుడు ఆయన నన్ను చూస్తే! సరే. ఫరవాలేదు. మీ కోసం ఏదైనా సహిస్తాను'' అన్నది.

ఆమె పిచ్చిదానిలా మాట్లాడుతూ ఒక్కసారి నాచెయ్యిపట్టుకొని నన్ను లాక్కొని వెళ్లటం మొదలుపెట్టింది. ఆమె నన్ను ఒక రహస్య మార్గం గుండా ఇంకొక గదిలోకి చేర్చింది. ఆగదిలోంచి బయటకువెళ్లే తలుపు తీసి ముందు నన్ను బయటకునెట్టి తాను కూడా నావెనకాలే రాబోయింది. కాని ఆమె చెయ్యి పట్టుకుని వెనుకనుంచి ఎవరో బలంగా లాగారు. ఆమె వెనక్కు పడిపోయింది.

నేను వెనక్కు చూచాను. ఆ నరరూప రాక్షసుడు థాపా నిలబడి వికటాట్టహాసం చేస్తున్నాడు. అతని రూపం చాలా భయంకరంగా ఉంది. సాక్షాత్తూ ఒక పెనుభూతం లాగా ఉన్నాడు. అతనితో సోమ పెనుగులాడు తూంది. నేను అతని కళ్లల్లోకి చూశాను. అతనూ నావైపు చూచాడు. ఆ చూపుతో నాకు మైకం కమ్మినట్లయింది. నాచూపు సన్నగిల్లింది. వాళ్లిద్దరూ నాకు దూర మౌతున్నట్లుగా ఉన్నది. ఇంతలో సోమ ''ఆనంద్! నన్ను కాపాడు. నన్ను రక్షించు'' అని కేక వేస్తున్నది. థాపా చెయ్యిపట్టుకుని ఆమెను వదిలించటానికి ప్రయత్నం చేశాను. కాని అతను నన్ను తనచేతితో బలంగా నెట్టివేశాడు. నా నోటిలోనుంచి 'సోమా' అనే పదంతప్ప ఇంకేమీ రాలేదు. అంతే. నాకు స్పృహతప్పింది.

నేను కళ్లుతెరిచి చూచేటప్పటికి బాగా తెల్లవారిపోయింది. నేను ఇంటి బయట నేలపై పడిఉన్నాను. రాత్రి జరిగిన సంఘట నంతా నాకళ్లకు ఒక సినిమాలాగ కనిపించింది. నేను వెంటనే గదిలోకిపోయి చూచాను. గది అంతా మామూలుగానే ఉంది. కాని నాకు చాలా నీరసంగా ఉంది.

ఇంక అక్కడ ఉండ బుద్ధిపుట్టలేదు. భయంవేసింది. వెంటనే నాపెట్టె,బెడ్డింగు తీసుకొని నా స్నేహితుడి ఇంటికి వెళ్లి పోయాను. అతనికిదంతా చెప్పితేవిని ''నేను మొదట్లోనే చెప్పాను—ఆ ఇల్లు మంచిదికాదని. మీరు విన్నారు కాదు. అనుభవించారు. మృత్యు ముఖంనుండి బ్రతికి బయటపడ్డారు'' అని మట్టుకు అన్నాడు.

నాకు తరువాత థాపా వ్రాసి ఇచ్చిన పది వేల రూపాయల చెక్కు సంగతి గుర్తుకువచ్చి నాచొక్కాజేబులో చూస్తే ఆచెక్కుఉంది. అది 'పంజాబ్ నేషనల్ బ్యాంకు'కు చెందినది. సరే, ఆచెక్కు సంగతేమిటో తెలుసుకుందామని బ్యాంకుకు వెళ్లితే, వారు కథంతావిని చెక్కును విస్మయంతో పరిశీలించి అది ఆరు సంవత్సరాల నాటిదని, అప్పుడు 'వీరేంద్రథాపా' పేరు మీద ఎకౌంటుఉండేదని, థాపా చనిపోయాక అతనిడబ్బు అతని వారసులు తీసుకొని వెళ్లారని, ఆచెక్కు చెల్లదని చెప్పారు.

ఇంక ఆరోజు మొదలుకొని నేను డేరాడూన్‌లో మళ్లీ ఇల్లు అద్దెకు తీసుకోలేదు. అక్కడ ఉన్నన్ని రోజులు నాస్నేహితుడి ఇంటిలోనే ఉన్నాను.

ఈకథ చదివినవారికి నామాటలమీద నమ్మకం కుదరకపోతే (ధైర్యం ఉంటేనే) డేరాడూన్‌వచ్చి, 'రాజపూర్' రోడ్డులో ప్రొఫెసర్ థాపాగారి ఇల్లెక్కడని అడిగితే ఎవరైనా చూపిస్తారు. ఆ ఇల్లు దయచేసి అద్దెకు తీసుకొని ఒక్కరాత్రి అక్కడ గడపండి. తరువాత మీకే తెలుస్తుంది. విశ్వాసమూ కలుగుతుంది. ధైర్యం కలవారు మాత్రమే ఆపని చేయటానికి తెగించండి. కాని చాలా ప్రాణాపాయం. తరువాత మీ ఇష్టం. ★